క్లుప్తంగా

నేడు పురపాలక సంఘం సమావేశం

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలక సంఘం సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ కమిషనర్ నిత్యానంద్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ కరుణ అధ్యక్షతన మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు సకాలంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి వైకుంఠ నారాయణ స్వామి ఉత్సవాలు

రాజోళి: మండల కేంద్రంలో వెలిసిన వైకుంఠ నారాయణ స్వామి ఉత్సవాలను మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ నుంచి వచ్చే నెల 6 వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు, విశేష పూజలు, అంకురార్పణ తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండో తేదీన లక్ష్మీ వైకుంఠ నారాయణ స్వామి కల్యాణానికి అన్ని రకాల ఏర్పాటు చేశామని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి కృప కటాక్షం పొందాలని కోరారు.

అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

గట్టు: మండల కేంద్రంలోని కొర్వంజమ్మవ్వ దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం అమ్మవారి ఆలయం దగ్గర దుర్గా హోమాన్ని నిర్వహించారు. మంగళవారం ఉదయం అభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అమ్మవారి పల్లకి సేవ, రాత్రి భజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలను ఆచరించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకున్నారు. అంతకుముందు భక్తులు శివలింగాన్ని అలంకరించారు.

స్వచ్ఛ మున్సిపాలిటీగా మార్చుకుందాం



అమరచింత: పట్టణాన్ని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుకుందామని, దీనికోసం ప్రజలు సహకరించాలని మెప్మా కోఆర్డినేటర్ యువరాజు అన్నారు. పట్టణంలోని పదో వార్డులో సోమవారం ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమాన్ని ప్రారంభించి కాలనీవాసుల ద్వార పాత వస్తువులు సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ మున్సిపాలిటీయే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని అన్ని వార్డుల్లో ప్రతి ఇంట్లో ఉన్న పాత వస్తువులు, కాగితాలు, నోటుపుస్తకాలు, పాత బట్టలు, చెప్పులు, ప్లాస్టిక్ పాడైన వస్తువులను సేకరించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పరిసరాల పరిశుభ్రత వ్యవహారంలో ప్రతి ఒక్కరూ మున్సిపపాలిటీకి సహకరించాలని కోరారు. తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడంలో ప్రజలు సంపూర్ణంగా సహకరిస్తున్నారని తెలిపారు

పకడ్బందీగా గొర్రెల పంపిణీ

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, పశువర్ధకశాఖ ఏడీ శ్రీనివాసులు, వెటర్నరీ వైద్యుడు రమేష్ అన్నారు. సోమవారం ఆత్మకూర్‌లోని శ్రీకృష్ణ గొర్రెల పెంపకందారుల సహకార భవనంలో లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవి యాదవ్, డైరెక్టర్ రాజేష్, జేఈఓ నిర్మల, సంఘాల అధ్యక్షులు కురుమూర్తి, చంద్రయ్య, రాజు, గోపాల్‌యాదవ్, రఘు, రమేష్, గొర్రెల పెంపకందారులు ఉన్నారు.

అధికారుల అలసత్వం

- సేకరించిన చెత్తకు నిప్పు
- డంపింగ్ యార్డుల్లోనే కాల్చివేత



చిన్నపోతులపాడు డంపింగ్‌యార్డులో కాలుతున్న చెత్త

మానవపాడు: పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామాల్లో వీధులు చెత్తాచెదారంతో కనిపంచకుండా గ్రామ సిబ్బంది ద్వారా చెత్త సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే విధంగా అన్ని ఏర్పాట్లకు పకడ్బందీగా చర్యలు తీసుకుంది. కాని క్షేత్రస్థాయిలో అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. కొన్ని గ్రామాల్లో వీధుల్లోనే చెత్తాచెదారం దర్శనమిస్తోంది. మరికొన్ని గ్రామాల్లో సేకరించిన చెత్త డంపింగ్‌యార్డులకు తరలిస్తున్నారు. తడి, పొడి చెత్త వేర్వేరు చేయకుండా పంచాయతీ సిబ్బంది కాల్చివేస్తున్నారు. కళ్లదుటే చెత్తను కాల్చివేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని పలువులు ఆరోపిస్తున్నారు.

పనిభారం తగ్గించుకునేందుకే..

గ్రామాల్లో రోజు వారిగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాల్సి ఉంది. ఏరోజు ఎన్ని ట్రిప్పుల చెత్తను సేకరించారనే వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలనే నిబంధనలు ఉన్నాయి. సేకరించిన చెత్త నుంచి పొడి చెత్తగా గుర్తించిన ఇనుము, ప్లాస్టిక్, గాజు తదితర వస్తువులను విక్రయించేందుకు సిద్ధంగా ఉంచాల్సి ఉంది. తడి చెత్త ద్వారా తయారమ్యే వర్మి కంపోస్టు విక్రయం ద్వారా రెండు విధాలుగా వచ్చే ఆదాయాన్ని ఎలా వినియోగించుకోవచ్చు. ఈ విధానం ద్వారా ఎందరికి ఉపాధి కల్పించవచ్చనే విధి విధానాలపై సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. ఇదంతా నిర్వహించడం భారమవుతుందనే ఆలోచనలతో గ్రామాల్లో సేకరించిన చెత్తతో పాటు వీధుల్లోని పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్లలో తరలించి డంపింగ్‌యార్డులో దహనం చేస్తున్నట్లు పలువురు విమర్శిస్తున్నారు. అధికారుల ఆదేశాలను పట్టించకుండా గ్రామాల్లో డంపింగ్‌యార్డులోనే కాల్చివేస్తూ దర్శనమిస్తున్నాయి. అధికారులకు తెలిసినా నిమ్మకు నిరేతినట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నీరు గారడమే కాకుండా ప్రజాధనం వృథా అవుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి గ్రామాల్లో చెత్త కాల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్య తీసుకుంటాం..



గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి. వీటిని కంపోస్ట్ ఎరువలు తయారీకి వినియోగించాలి. చెత్తను ఇష్టానుసారంగా డంపింగ్ యార్డుకు తరలించి కాల్చివేస్తే చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యదర్శులకు సమావేశలు ఏర్పాటు చేసి చెత్తను కాల్చకుండా అవగాహన కల్పిస్తాం.

– రమణారావు, ఎంపీడీఓ, మానవపాడు

సైబర్ నేరాలపై అప్రమత్తం



కొత్తపాలెంలో అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాజాతా బృందం

ధరూరు: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పోలీసు కళాజాతా బృదం సభ్యులు అన్నారు. జిల్లా ఎస్పీ సృజన ఆదేశానుసారం మండలంలోని కొత్తపాలెంలో సోమవారం సాయంత్రం షీ టీం, పోలీసు కళాజాతా బృందం, భరోసా టీం సభ్యులు ఎస్ఐ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు, యువకులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మహిళలకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. పోలీసు చట్టాలు, సీఈఐఆర్ వినియోగం గురించి వివరించారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వారు తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు తెలుపొద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే బాధితులు 1930 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో షీ టీం, కళా బృదం సభ్యులు రాధమ్మ, కృష్ణ, రామాంజనేయులు, రామిరెడ్డి, శేషన్న, భరోసా సిబ్బంది శివాని, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతే ప్రభుత్వ లక్ష్యం

అయిజ: పల్లెల ప్రగతే ప్రభుత్వ లక్ష్యమని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండలంలోని గుడుదొడ్డి, మల్దకల్ మండలంలోని చిప్పదొడ్డి గ్రామాల మధ్యలో ఉన్న వాగుపై రూ.3.55 కోట్ల నిధులతో చేపట్టనున్న హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పనులను నాణ్యతగా చేయాలని సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ విజయ్‌కుమార్

గట్టు: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని చాగదోనలో ప్రీమియర్ సీజన్–1 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అంతకు ముందు క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. టోర్నమెంట్ దాతలుగా మొదటి బహుమతి రూ.25 వేలను ఎంపీపీ విజయ్‌కుమార్, ద్వితీయ బహుమతి దాత సర్పంచ్ ఇంజమ్మ రూ.15 వేలు, షీల్డ్ దాతగా కార్తీక్‌గౌడ్‌లు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకరన్న, మాజీ ఎంపీటీసీ బుడ్డప్ప, గ్రామస్తులు నర్సింహులు, తిమ్మప్ప, శివప్ప, సుదర్శన్, నర్సింహులు, ప్రవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల ముందస్తు అరెస్టు



వీఓఏలను అరెస్టు చేసిన పోలీసులు

ధరూరు: న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 44 నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న వీఓఏలను పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టిన సభకు తరలుతున్న వీఓఏలను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు కనీస వేతనం రూ.26వేల చెల్లించాలని, ఉద్యోగ భద్రత, బీమా, ఆరోగ్య గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. అరెస్ట్ అయిన వారిలో వీఓఏలు శ్రీను, మోహన్, నారాయణ, భీమేష్, రాములు, తిమ్మప్ప, శివన్న, తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన చాకలి మహేశ్వరి ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కొండేరు గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5000 వేలు ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకుల నుంచి సేకరించిన రూ. 1,50,00 నగదును మృతురాలి ఇద్దరు కూతుర్ల పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈరన్న, ఎంపీటీసీ వీరన్న, గ్రంథాలయ డైరెక్టర్ గుమ్మాగోవర్ధన్, నాయకులు నారాయణ నాయుడు, వీరబాబు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

రైస్‌మిల్ యజమానిపై కేసు నమోదు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ సూర్య ట్రేడర్స్ యజమాని టి.నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి 2021–2022 యాసంగి సీజన్‌లో రూ.3.50 కోట్ల నష్టం కలిగించాడని టీఎస్‌సీఎస్‌సీఎల్ జిల్లా మేనేజర్ ప్రసాద్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఈద్గా పనులు ప్రారంభించండి

అమరచింత: పట్టణంలో నూతన ఈద్గా పనులను వెంటనే ప్రారంభించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. ఈద్గా ప్రాంతాన్ని సోమవారం సందర్శించి శిథిలావస్థకు చేరువలో ఉన్న ఈద్గాను తొలగించాలన్నారు. వీటి కోసం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రూ.ఐదు లక్షలు మంజూరు చేశారని, రంజాన్ మాసంలో పనులను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించినా ఇప్పటి వరకు ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఈద్గా నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిప్పు, ఫయాజ్, ఖదీర్ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీంద్ర

శాంతినగర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ రవీంద్ర అన్నారు. సోమవారం పట్టణంలో వడ్డేపల్లి మండల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జూన్ 2 నుంచి 22 వరకు వేడుకలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల గురించి వివరిస్తూ అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీలలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



గద్వాలలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో గద్వాల పట్టణం, కేటీదొడ్డి, మల్దకల్ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు వైద్యం నిమిత్తం ఎల్‌వోసీలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, గ్రంథాలయ జిల్లా అధ్యక్షుడు జంబురామన్‌గౌడ్, కౌన్సిలర్ మురళి, జమ్ములమ్మ ఆలయ చైర్మన్ సతీష్, వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కేటీదొడ్డిలోని కొండాపురంలో..

రైతు అండగా ఉంటాం..

కేటీదొడ్డి: రైతులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన రైతు హరిజన స్వామి పాముకాటుతో మృతి చెందాడు. దీంతో రైతు బీమా నుంచి రూ. 5 లక్షలు మంజూరయ్యాయి. సోమవారం బాధిత గ్రామానికి వెళ్లి మృతిడి భార్య పద్మమ్మకు రూ. 5 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాల జిల్లా చైర్మన్ జంబురామన్‌గౌడ్, మండల అధ్యక్షుడు ఉరుకుందు, పార్టీ నాయకులు చక్రధర్, శేఖర్‌రెడ్డి, రాజేష్, గోపి, గోవిందు, యుగందర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అఖండ భజన



భజన కార్యక్రమంలో భక్తి గీతాలతో ఆలపిస్తున భక్తులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో 12 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించిన అఖండ భజన భక్తిశ్రద్ధలతో కొనసాగింది. సోమవారం ఉదయం 6 గంటలకు అఖండ భజన కార్యక్రమాన్ని అయ్యప్ప స్వామి ఆలయంలో అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి వ్యవస్థాపకుడు దేశ్ ముఖ్ పాండే ప్రారంభించారు. అయ్యప్ప స్వామి ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. భద్రాచలం, వనపర్తి, కొల్లాపూర్, హైదరాబాద్, నారాయణ్ పేట్, నెల్లూరు, ఒంగోల్, నాగర్‌కర్నూల్, జిల్లాల నుంచి భజన బృందాలు పాల్గొన్నాయి. గద్వాల్ జిల్లాలోని అలంపూర్, కంచుపాడు, ప్రాగటూరు, లింగన్‌వాయి, కోనేరు బుక్కాపురం, మారమునగాల గ్రామాల భజన బృందాలు పాల్గొన్నాయి. దేశ్‌మక్ పాండ్యే మాట్లాడుతూ నీ గానమే నా ప్రాణం ఉండవెల్లిలో 26వ కార్యక్రమంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం సమయంలో శివాలయం నుంచి అయ్యప్ప స్వామి ఆలయానికి నందికోలసేవ నిర్వహించారు. అనంతరం రాత్రి సమయంలో మహా పడిపూజ నిర్వహించి పద్దెనిమిది మెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సూర్యకాంతారెడ్డి, కోటిశ్వర్ రెడ్డి, శర్నయ్య, గోపాల్, రాంబూపాల్ రెడ్డి, అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ బృందం, సభ్యులు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ముందుకు సాగని పనులు

- 4 కి.మీ రహదారి నిర్మాణానికి రూ.3.50 కోట్లు మంజూరు
- ఐదేళ్లు గడుస్తున్నా పనులు చేపట్టని కాంట్రాక్టర్
- కచ్చ రహదారితో రైతుల ఇక్కట్లు

అమరచింత: ఐదేళ్ల కిందట అమరచింత నుంచి మూలమళ్ల వరకు ఉన్న కచ్చ రహదారిని బీటీగా మార్చేందుకు నిధులు మంజూరైనా ఇప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగట్లేదు. 4 కిలోమీటర్ల మేర బీటీ వేయడానికి ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులను చేపట్టకపోవడంతో ప్రజలు, రైతులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమరచింత ఎత్తిపోథల పథకంతో పాటు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ ద్వారా సాగునీరు సమృద్ధిగా లభిస్తుండటంతో ఇరుగ్రామాల రైతులు ఏడాదిలో రెండు పర్యాయాలు వరి పంటను పండిస్తున్నారు. వరిధాన్యాన్ని మార్కెట్‌కు తరలించే యత్నంలో కచ్చ రహదారిపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు పలుమార్లు ప్రమాదానికి గురయ్యాయి. ఈ రహదారిపైనే జూరాల ప్రాజెక్టును సందర్శించే పర్యాటకులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీటీ పనులు వెంటనే చేపట్టాలని పలుమార్లు పీజేపీ అధికారులకు విన్నవించినా.. ఇప్పటికీ పనుల్లో కదలిక లేకపోవడం దారుణమని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. రోడ్డు పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ విషయంలో అధికారులు మౌనంగా ఉండటంతోనే బీటీ రహదారి పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

మండల సమావేశంలో తీర్మాణం చేసినా..

అమరచింత, మూలమళ్ల గ్రామాలకు బీటీ పనులు వెంటనే చేపట్టాలని మండల పరిషత్ సాధారణ సమావేశంలో తీర్మాణాలు చేయటమే తప్పా.. ఇప్పటి వరకు పనులు చేపట్టలేని పరిస్థితుల్లో అధికారులు కొట్టుమిట్టాడుతున్న పరిస్థితులు దాపరించాయి. పనులు వెంటనే ప్రారంభించాలని, నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదేశించినా.. అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకు రావడంలేదు. పీజేపీ అధికారులు మాత్రం ఇప్పటి వరకు మూడు పర్యాయాలు కాంట్రాక్టర్‌కు నోటీసులు అందించామని చెప్పురకొస్తున్నారే తప్ప పనుల్లో పురోగతి చూపలేక పోతున్నారు. వస్తున్నది వర్షకాలం కావడంతో మళ్లీ పనులు వాయిదా పడినట్లేనని ఇరు గ్రామాల రైతులు వాపోతున్నారు.



అమరచింత నుంచి మూలమళ్లకు వెళ్లే కచ్చ రహదారి

మద్దూరులో కంటి వెలుగు శిబిరం

గట్టు: మండలంలోని ఆలూరు, బస్వాపురం, మాచర్ల గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం ఆయా గ్రామాల్లో వైద్యాధికారులు కంటి పరీక్షలను నిర్వహిస్తున్నారు. మూడు గ్రామాల్లో మొత్తం 402 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 21 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 25 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, సాయిచరణ్, సమీరాకౌసర్, హెల్త్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్‌ఎంలు భారతి, కేజీయా, రావెల, ఆయా గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని మద్దూరులో సోమవారం కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 171 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, 11 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఏడుగురికి కంటి అద్దాల కోసం రిఫర్ చేశారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ కంటి వెలుగును వినియోగించాలని డాక్టర్ యాకుబ్‌బాషా పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గట్టులోని ఆలూరులో..

పర్మినెంట్ చేయాలని ఎంపీడీఓకు వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్

రాజోళి: గ్రామ పంచాయతీలో పని చేస్తున్న మొత్తం సిబ్బందిని పర్మినెంట్ చేయాలని తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ డిమాండ్ చేశారు. సోమవారం గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి ఎంపీడీఓ గోవింద్‌రావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బంది వేతనం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ ఏర్పాటు చేయాలని, 2011 జనాభా ప్రాతిపదికన కాకుండా, జనాభాకు అనుగుణంగా కార్మికులను పెంచాలని కోరారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించడంతో పాటు, కారోబార్ బిల్ కలెక్టర్లు, స్వీపర్లు, ఎలక్ట్రికల్ వాటర్ మ్యాన్‌లు, డ్రైవర్‌లు తదితర సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిమ్మప్ప, మద్దిలేటి, దేవన్న, ఏబు, దేవదాసు, పెద్దయ్య, రాజ్‌కుమార్ తదిదరులు పాల్గొన్నారు.

శాంతినగర్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరుతూ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓకు సోమవారం అందజేశారు. జీవో నెంబర్ 16 ప్రకారం కారోబార్లకు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750 వేతనం అందజేయాలని, సిబ్బంది వేతనం కోసం ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్‌ను ఏర్పాటు చేయాలని, ప్రతి కార్మికుడికి రూ.5 లక్షల బీమా వర్తింపజేయాలన్నారు. శ్రీను, నర్సింహులు, ప్రకాషం, రాజు, దౌలత్, కృష్ణ, రాముడు, రవి పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు